# కళకోసం వెత

క-కళకోసమే తను జీవిస్తున్నాడు. జీవితంలో కళ నిత్యం కనిపిస్తుంది తనకు.

ఎవడేనా కళని పోషించదలచుకుంటే ఆధునిక యుగంలో 'సినిమా మధ్యవర్తిత్వం' కన్నా దగ్గరి తోవ మరొకటి లేదు. కళకోసం అగ్నిసాక్షిగా 'నీవే నేను' అన్న విశాలాక్షిని వొదిలి, అందంలో అంతకు తక్కువగానే వున్న సావిత్రిని చేరదీసిన తనకు, యీ మార్గాన నడవటం తోచింది సునాయాసంగా.

ఏం? కావల్సినంతడబ్బు సావిత్రికి. తను వుద్యోగం చెయ్యనక్కరలేదు. తగిన కాలక్షేపం ఏమిటి? కళకోసం 'సినిమా పత్రిక' తను నడుపుతాడు.

ఉంది. ఇప్పటికే తనవూళ్ళో కావల్సినంత కళాసేవ చేస్తున్న సినిమా పత్రిక. కాని...? తనముందు; తన కళాతృష్ణముందు...? కళాసేవ ఎవరూ గుత్తకు తీసుకొనలేరు. కొనలేరు కూడా? విదేశాలనుంచి తక్కువ విలువకే వచ్చే పత్రికలను మించే స్థాయి లో వుంచగలడు తనపత్రికని. రాజకీయంగా నెపోలియన్‌కు అసాధ్యమయిందిలేకపోతే, తనకు కళా పరంగా అసాధ్యమైంది లేదు!

తన చేతి క్రిందికి యిద్దర్ని తీసుకుంటాడు. బాగా రాయగలవాళ్ళు-రాస్తూ రాస్తూనే తమభాషకు, నైపుణ్యానికి తన్మయులై మూర్ఛపోయేవాళ్ళు- భాషామతల్లికి అపరిచితులు కానివాళ్ళు.

అనుకున్న తరువాత కానిదేమిటి? అప్పుడేవచ్చింది మొదటిసంచిక. కళాపరంగా తారాపథాన్ని అందుకున్న మహనీయుల ఆశీస్సులతో, సాహిత్యపరంగా తారాపథాన్నుండీ దిగివచ్చిన దిగ్గజాల మంగళాశాసనలతో, ప్రాచీన శిల్పనైపుణ్యాన్ని వెక్కిరించే సినిమా బొమ్మలకూటమితో-వచ్చేసింది.

మగవాడనిపించుకున్నాడు. మనుగడ పసందన్నాడు. పగలే ముగ్గరూ నానా సౌధాలు కట్టేశారు. కొద్దో గొప్పో లోకులసొమ్ము తేరగా(!) జేరాక, సినిమా తియ్యటానికి మదరాసూ వెడతారు - తారలు వెంటపడతారు తమని 'బుక్' చేసుకోమని-ఎదురు డబ్బు సమర్పిస్తామంటారు. కాదూ? కళా నైపుణ్యం అట్లాంటిది.

రెండో సంచిక వేసేరోజు దగ్గరికొస్తే, మొదటి సంచికలన్నీ పోస్టులో యేజంట్లనుంచి తిరిగివచ్చేశాయి.

తమ కళాపిపాస, యీ లోకం కళ్ళుతెరచి చూడనేలేదు. చూడటం చేతకాదు మానవాళికి. ఏది మంచో, యిట్టే తెలుసుకొనే యోగ్యత యింకా పట్టలేదు. వస్తాయనుకున్న డబ్బుమూటలు యధాస్థానాలనుంచి కదలటానికి తిరస్కరిస్తే పని జరగటం ఎట్లాగని?

కార్యశూరులు నిరుత్సాహపూరితులు కారు. ప్రాణాలైనా ధారపోసి, కార్యం కొనసాగిస్తారు. ఉన్నదీ, ఉంచుకున్నదీ పోగుచేస్తే అయిదునెలలు గడిచింది. అచ్చుచేసే యంత్రపు తిండికి కావాలామరి? ఆ యంత్రాన్ని శాసించేవాడి నోరు పూడాలి కాదూ? పనిచేసే ముగ్గురికీ పంచభక్ష పరమాన్న సహితంగా భోజనం అమరాలా?

మార్గమేమిటి ? గోడలు కట్టాటానికి దారెటు?

చిల్లులు పూడ్చటానికి మట్టి...?

చెవులు ఝూడింపుమాత్రం దక్కుతుంది.

తెలివి తక్కువ వాళ్ళు కట్టిన డిపాజిట్లకు నువ్వుల నీళ్ళు ఎక్కడ? అచ్చువాళ్ళకి వందలు ఎప్పుడు, ఎట్లా యివ్వాలి?

దొంగ చెక్కులు మార్చటానికి ధైర్యం ఎట్లా వస్తుంది? కళ - యేమయింది? అసలేమిటి? తనకేం తెలుసు----? వొద్దు! మిగిలిందే చాలు!...

బుర్ర తిరిగిపోతోంది తనకు.

సావిత్రితో కూడి సయ్యాటలాడుతూ, పల్లెసీమకు చేరాడు మిగిలిన అయిదు ఎకరాలూ దున్నుకుంటూ బతకలేకపోతామా అని. ❋

(చిత్ర కళ)